సాక్షి అనకాపల్లి

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025

అప్పన్న ఉంగరం చోరీ



నీలుడు వేషధారణలో దారి దోపిడీకి పాల్పడుతున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి సింహగిరి మాడ వీధిలో మృగయోత్సవం (దొంగ లదోపు) కనులపండువగా జరిగింది. కల్యాణం తర్వాత స్వామివారు అమ్మవార్లతో విహారానికి వెళ్లినప్పుడు నీలుడు అనే పండితోత్తముడు దారి దోపిడీకి యత్నించినందుకు గుర్తుగా ఈ వేడుక నిర్వహిస్తారు. కల్యాణోత్సవాల్లో భాగంగా దారి దోపిడీ జరిగే ఘట్టాన్ని శనివారం రాత్రి విశేషంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామి ఉంగరం వెతికే ఘట్టమైన వినోదోత్సవం జరగనుంది. - సింహాచలం

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులుగా ఇద్దరికి చోటు



ఎంపీ గొల్ల బాబూరావు



మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

విశాఖ సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ)ని పునర్వ్యవస్థీకరించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఎంపీ గొల్ల బాబూరావుతో పాటు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడులకు సభ్యులుగా స్థానం లభించింది. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం ప్రకటించింది. అలాగే పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్లు పీఏసీ శాశ్వత ఆహ్వానితులుగా ఉండనున్నారు. రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పీఏసీ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.

రేపు పీజీఆర్‌ఎస్ రద్దు

తుమ్మపాల: ఈనెల 14న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించినందున కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

యూత్ బాక్సింగ్ టోర్నీలో నింజాస్ క్రీడాకారులు



టోర్నమెంట్‌లో పాల్గొన్న బాక్సింగ్ క్రీడాకారిణులు

నర్సీపట్నం : విశాఖ పోర్ట్ స్టేడియంలో ఈ నెల 12 నుండి 13వ తేదీ జరుగుతున్న యూత్ ఉమెన్ మెన్ బాక్సింగ్ టోర్నమెంట్ నర్సీపట్నం నింజాస్ అకాడమీ నుంచి ఆరుగురు బాక్సర్లు పాల్గొన్నారు. శాప్ కోచ్ అబ్బు, ఉమెన్ కోచ్ వేపాడ ప్రియాంక ఆధ్వర్యంలో రిషిత, ఆల్తీ శిరీష, కొంచాడ నందిని, బొండా హేమ, రాజ రాజేశ్వరి, శశికుమార్ పాల్గొన్నారు.

హోం మంత్రి హోమం

- అంతా రహస్యం



హోం మంత్రి అనిత ఇంటిలో నిర్వహిస్తున్న హోమం

సాక్షి, అనకాపల్లి: హోం మంత్రి పదవిలో కొనసాగడానికి, పాప దోషాలు పోవడానికి నక్కపల్లి మండలం సారికవానిపాలెం గ్రామంలో గల తన నివాసంలో హోం మంత్రి వంగలపూడి అనిత శనివారం హోమం చేయించుకున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిపిన ఈ కార్యక్రమానికి అతి ముఖ్యులైన టీడీపీ నాయకులు హాజరైనట్టు సమాచారం. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలగడం, మహిళలపై అఘాయిత్యాలు పెరగడంతో ఇటీవల ప్రభుత్వ పాలనపై ముఖ్యంగా హోం శాఖ నిర్వహణపై విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. హోమం జరిపించిన విషయాన్ని మంత్రి అత్యంత గోప్యంగా ఉంచారు.

అతలాకుతలం



జిల్లా అంతటా వడగళ్ల వాన కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

ఘనంగా ఉరుసు ఉత్సవం



8లో

అట్టడుగున అనకాపల్లి

యలమంచిలి రూరల్:

ఇంటర్‌లో జిల్లాకు ఆశించిన ఫలితాలు రాలేదు. రెగ్యులర్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం నిరాశ కలిగించింది. రాష్ట్రంలో ప్రథమ సంవత్సరంలో 20వ స్థానం, ద్వితీయ సంవత్సరంలో 25వ స్థానం దక్కింది. శనివారం విడుదల చేసిన ఫలితాల్లో ఇంటర్ ఫస్టియర్‌లో 62.62 శాతం, సెకండియర్‌లో 72.98 శాతంతో జిల్లా వెనుకంజలో ఉంది. మొదటి సంవత్సరంలో 10,279మంది జనరల్ విద్యార్థులు పరీక్షలు రాయగా 6437 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్‌లో 9512 మంది పరీక్షలకు హాజరు కాగా 6942 మంది పాసయ్యారు. వొకేషనల్ సెకండియర్‌కు 2128 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 1429 మంది ఉత్తీర్ణత సాధించారు. వొకేషనల్ ఫస్టియర్‌లో 2174 మంది పరీక్షలు రాయగా 1217 మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది ఇంటర్ ఫస్టియర్‌లో 52 శాతం, సెకండియర్‌లో 66 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఏడాది స్వల్పంగా ఉత్తీర్ణత శాతం పెరిగినప్పటికీ రాష్ట్రంలో మిగతా జిల్లాలతో పోల్చితే జిల్లా విద్యార్థులు రాణించలేకపోయారు. విద్యార్థుల జీవితాల్లో కీలకమైన ఇంటర్మీడియట్ ఫలితాలను పరిశీలిస్తే ఆశాజనకంగా లేకపోవడం కలవరపరుస్తోంది.

సత్తా చాటిన గురుకులాలు..

ప్రభుత్వ సెక్టార్‌లో ఉన్న వివిధ గురుకులాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ఒకటి రెండు మినహా మిగిలిన గురుకులాలు మెరుగైన ఫలితాలు సాధించాయి. ఫస్టియర్‌లో బీసీ రెసిడెన్షియల్ కాలేజీలు 95.36 శాతం, బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాలు 80 శాతం, కేజీబీవీలు 86.46 శాతం, మోడల్ స్కూళ్లు 80.06 శాతం ఉత్తీర్ణత సాధించాయి. సెకండియర్‌లో బీసీ రెసిడెన్షియల్ కళాశాలలు 95.48 శాతం, అంబేడ్కర్ గురుకులాలు 88 శాతం, కేజీబీవీలు 90.68 శాతం, మోడల్ స్కూళ్లు 91.29 శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నాయి.

కేజీబీవీ విద్యార్థులు భళా

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ విద్యార్థులు ఈసారి ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ రెండో సంవత్సరం బైపీసీలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న ఇద్దరూ కేజీబీవీలో చదివినవారే. తేగాడ కేజీబీవీ విద్యార్థి కంట్రెడ్డి రాజులమ్మ 983, నక్కపల్లి కేజీబీవీలో చదివిన పిరాది భవాని 982 మార్కులు సాధించారు. రైతు కుటుంబానికి చెందిన రోలుగుంట ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థిని మడ్డు గౌతమి ఎంపీసీలో 986 మార్కులు సాధించింది.

- ఎస్.రాయవరం కేజీబీవీలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. జూనియర్ ఇంటర్‌లో 90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- కోటవురట్ల కేజీబీవీలో సెకండియర్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించగా ప్రథమ సంవత్సరంలో 96.4 శాతంమంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.
- యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని కొక్కిరాపల్లి సాంఘిక సంక్షేమ గురుకులంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 92 శాతం ఉత్తీర్ణత దక్కింది.

ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు డీలా..

రూ.వేలకు వేలు ఫీజులు తీసుకుంటూ గొప్పగా ప్రచారం చేసుకుంటున్న ప్రైవేట్ కళాశాలలు ఫలితాల్లో డీలా పడ్డాయి. జిల్లాలో ప్రైవేటు కళాశాలలు మొదటి సంవత్సరంలో 64.96 శాతం, రెండో సంవత్సరంలో 73.76 శాతం ఉత్తీర్ణత సాధించాయి. అన్ని సౌకర్యాలు కల్పించినా ప్రభుత్వ కళాశాలల్లో కూడా మెరుగైన ఫలితాలు రాలేదు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ కాలేజీల్లో ఫస్టియర్‌లో 43.74 శాతం, సెకండియర్‌లో 60.73 శాతం మాత్రమే ఉత్తీర్ణత వచ్చింది.

మే 12 నుంచి సప్లిమెంటరీ

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను మే 12వ తేదీ నుంచి మే 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలను మే 28 వ తేదీ నుంచి జూన్ 1 వరకు జిల్లా కేంద్రంలో మాత్రమే నిర్వహిస్తారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఈ నెల 22వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బి.సుజాత తెలిపారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్, జవాబు పత్రాల స్కానింగ్ కాపీ కోసం ఈనెల 13వ తేదీ నుంచి 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

నిరుత్సాహపరిచిన ఇంటర్ ఫలితాలు	సెకండియర్‌లో 25వ స్థానం	ఫస్టియర్‌లో 20వ స్థానం

- గతేడాది కంటే స్వల్పంగా పెరిగిన ఉత్తీర్ణత శాతం
- ప్రభుత్వ కళాశాలల్లో నిరాశాజనకమైన ఫలితాలు

ఐఐటీ సాధించాలి..



గౌతమికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, వెంకటలక్ష్మి

ఎంపీసీ 986/1000

రోలుగుంట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఎంపీసీలో 986 మార్కులు సాధించిన మడ్డు గౌతమి సామాన్య రైతు కుటుంబానికి చెందిన బాలిక. తండ్రి లక్ష్మీనారాయణ వ్యవసాయ పనులు చేస్తారు. తల్లి వెంకటలక్ష్మి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కుక్‌గా చేస్తున్నారు. చదువుపై మక్కువ ఉన్న తమ కుమార్తెకు పెద్ద చదువులు చెప్పించాలన్నది వారి ఆశయం. గౌతమి ప్రథమ సంవత్సరంలో 470 కి 463 సాధించి టాపర్‌గా నిలిచింది. ఆరో తరగతి నుంచి పది వరకు కేజీబీవీలో చదువుకుంది. గౌతమి 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఐఐటీ సాధించి, మంచి ఇంజినీరుగా రాణించాలన్నది తన ఆశయమని చెప్పింది. తన తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, తండ్రితోపాటు తన తల్లి కూడా వ్యవసాయ పనులు చేస్తూ ఎంతో శ్రమిస్తోందని తెలిపింది. అన్నయ్య మహేష్ సహకారం మరువలేనిదన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, ఎస్వో తులసి అందించిన సహకారంతోనే తాను ఇన్ని మార్కులు సాధించానని తెలిపింది.

ఉపాధ్యాయ వృత్తి ఇష్టం



పిరాది భవానీకి స్వీట్లు తినిపించి అభినందిస్తున్న తల్లిదండ్రులు

బైపీసీ 982/1000

నక్కపల్లి: తనకు ఉపాధ్యాయ వృత్తి అంటే ఎంతో ఇష్టమని బైపీసీలో 982/1000 మార్కులు సాధించిన నక్కపల్లి కేజీబీవీ విద్యార్థిని పిరాది భవాని తెలిపింది. ఆమె స్వగ్రామం పాయకరావుపేట మండలం రాజవరం. తల్లిదండ్రులు నాగేశ్వర రావు, సుభద్ర మత్స్యకారులు. స్థానికంగా వేట సాగకపోవడంతో ఒరిశాలోని పూరీకి తాత్కాలికంగా వలస వెళ్లారు. భవాని ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు నక్కపల్లి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయలో చదువుకుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, పాఠశాల ప్రిన్సిపాల్‌తోపాటు, ఉపాధ్యాయినులు చూపించిన ప్రత్యేక శ్రద్ధ వల్లే తాను మంచి మార్కులు సాధించగలిగానని తెలిపింది. తనకు ఉపాధ్యాయ వృత్తి అంటే ఎంతో ఇష్టమని డిగ్రీ చదివి బీఈడీ చేసి టీచర్‌ను అవుతానని తెలిపింది. ప్రస్తుతం పూరీలో ఉన్న ఆమె తల్లిదండ్రులు సాక్షితో మాట్లాడుతూ.. తమకు చదువు సంధ్యలు లేవని, ఇద్దరు పిల్లలను బాగా చదివించాలన్నదే తమ ఆశయమన్నారు.

జిల్లా ఫలితాలు ఇలా...

జనరల్	
ఫస్టియర్	62.62 శాతం
సెకండియర్	72.98 శాతం
వొకేషనల్	
ఫస్టియర్	55.97 శాతం
సెకండియర్	67.15 శాతం

డాక్టర్‌ను అవుతా..



కంట్రెడ్డి రాజులమ్మ

బైపీసీ 983/1000

కశింకోట: వైద్యురాలిగా సేవలు అందించడమే తన ధ్యేయమని కంట్రెడ్డి రాజులమ్మ చెప్పింది. ఆమె తేగాడ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయలో చదివి బైపీసీలో 983/1000 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడుతూ నీట్ కోచింగ్ తీసుకుంటున్నానని, ప్రవేశ పరీక్ష రాసి పశు వైద్యాధికారి కావాలని భావిస్తున్నానన్నారు. రావికమతం మండలం గొండ గ్రామానికి చెందిన ఆమె తండ్రి నాయుడు, తల్లి మంగ వ్యవసాయదారులు. రాజులమ్మ టెన్త్‌లో 553 మార్కులు సాధించి బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపేట హైస్కూల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు రావడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పింది.



ఎంఎల్‌టీలో 989/1000

నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఎల్‌టీలో 989 మార్కులు సాధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని హరిత



సుప్రియ

ఎంపీసీ 988/1000



ఎ.హర్షిత

ఎంపీసీ 988/1000

అడ్డదారిలో బండరాళ్లు

- సామర్థ్యానికి మించి లారీల్లో తరలింపు
- టోల్‌ఫీజును ఎగ్గొట్టేందుకు అడ్డదారుల్లో ప్రయాణం
- రాళ్ల తరలింపు వెనుక కూటమి ప్రజాప్రతినిధులు
- కన్నెత్తి చూడని పోలీసు, రవాణా, మైనింగ్, విజిలెన్స్ అధికారులు



బండరాళ్ల లోడుతో ఉన్న లారీలు

నక్కపల్లి: కూటమి ప్రజాప్రతినిధుల అండదండలతో బండరాళ్ల లారీలు దొడ్డిదారిలో రాకపోకలు సాగిస్తున్నాయి. జాతీయ రహదారి మీదుగా తీసుకెళ్లాల్సిన లారీలను టోల్ ఫీజు నుంచి తప్పించుకోవడం కోసమే డ్రైవర్లు అడ్డదారి పట్టిస్తున్నారు. అధికారులు, స్థానిక ప్రజల కళ్లు కప్పి రాత్రి పూట మారుమూల గ్రామాల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఫలితంగా రోడ్లు శిథిలమవుతున్నాయంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ బండరాళ్ల వాహనాలు గ్రామీణ ప్రాంత ప్రజల రాకపోకల కోసం వేసిన ఇరుకు రోడ్లలో ప్రయాణిస్తూ బోల్తా పడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనంటూ ఆయా గ్రామాల వారు భయాందోళనలు చెందుతున్నారు. ప్రతి రోజు 70 నుంచి 100 బండరాళ్ల లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. లారీ నుంచి ఒక్క బండరాయి జారిపడినా పెను ప్రమాదమేనని వారు చెబుతున్నారు. పరిమితికి మించి సామర్థ్యంతో ఎటువంటి వే బిల్లులు లేకుండా ప్రయాణిస్తున్న వాహనాలపై రవాణా, మైనింగ్, పోలీసు శాఖల అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాజమండ్రి నుంచి రాంబిల్లికి పెద్ద పెద్ద బండరాళ్ల లోడుతో లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. రాంబిల్లి సమీపంలో సముద్రంలో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నిర్మించే ఎన్ఏవోబీ నిర్మాణ పనుల్లో బండరాళ్లను వినియోగిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

కూటమి నాయకుల అండతో తరలింపు

ఈ బండరాళ్ల తరలింపు వెనుక కూటమి పార్టీలకు చెందిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. రాజమండ్రి సమీపంలో ఉన్న నల్లరాయి క్వారీల నుంచి బ్లాస్టింగ్ చేసి ఈ రాళ్లను రాంబిల్లి తరలిస్తున్నారని తెలుస్తోంది. కూటమి నేతల అండదండలు ఉండటం వల్లే లారీల్లో సాధారణ సామర్థ్యం కంటే రెట్టింపు లోడు వేసి బండరాళ్లను తరలిస్తున్నారు. సందట్లో సడేమియాలా ఈ గ్రామాల పరిధిలో ఉన్న కొంతమంది కూటమి పార్టీలకు చెందిన చోటా కార్యకర్తలు లారీలను ఆపేసి బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఉపమాక, నక్కపల్లి సమీపాల్లో ఇటీవల కాలంలో విలేకరులం, స్థానిక నాయకులమని చెప్పి ఇద్దరు వ్యక్తులు 10మంది లారీ డ్రైవర్లను బెదిరించి రూ.3 వేల చొప్పున వసూలు చేసినట్టు తెలిసింది.



భారీ వాహనాల రాకపోకల కారణంగా శిథిలమయిన వేంపాడు తమ్మయ్యపేట రోడ్డు



కాగిత సమీపంలో బండరాళ్లతో బోల్తాపడ్డ లారీ

పెనాల్టీ ఎగ్గొట్టేందుకే అడ్డదారులు

సాధారణంగా మల్టియాక్సిల్, 10 టైర్లు కలిగిన లారీల్లో 40 టన్నుల బరువును వేసి రాకపోకలు సాగించవచ్చు. ఇటువంటి లారీలు సింగిల్ జర్నీకి రూ.760లు ఫీజు చెల్లించాలి. రెండువైపులా 24 గంటల లోపు ప్రయాణిస్తే రూ.1140 చెల్లించాలి. గత కొద్ది నెలలుగా రాకపోకలు సాగిస్తున్న లారీల్లో 80 టన్నుల బరువు కలిగిన బండరాళ్లను లోడ్ చేసి తరలిస్తున్నారు. ఇలా సామర్థ్యానికి మించిన లోడుతో వెళ్తున్న లారీల నుంచి గతంలో వేంపాడు టోల్ ప్లాజా సిబ్బంది రూ.5 వేల నుంచి రూ.6 వేలు అదనంగా ఫీజు వసూలు చేశారు. టోల్‌ప్లాజాల వద్ద అదనంగా విధించే పెనాల్టీతోపాటు సాధారణంగా చెల్లించే టోల్‌ఫీజును ఎగ్గొట్టేందుకు బండరాళ్ల లారీలు అడ్డదారుల్లో ప్రయాణిస్తున్నాయి. వేంపాడు ఊళ్లో నుంచి అమలాపురం, చందనాడ, నర్సాపురం బుచ్చిరాజుపేట మీదుగా ఉపమాక వచ్చి అక్కడ నుంచి నక్కపల్లి జాతీయ రహదారి పైకి చేరుకుంటున్నాయి.

ప్రభుత్వ పెద్దల జోక్యంతో నిలిచిన తనిఖీలు

కొద్ది రోజుల క్రితం ఇలా సామర్థ్యానికి మించి ఎటువంటి వే బిల్లులు లేకుండా బండరాళ్లతో వెళ్తున్న లారీలను రవాణా, విజిలెన్స్ అధికారులు పట్టుకుని రూ.36 వేల పెనాల్టీ విధించారు. తర్వాత కూటమి పెద్దల జోక్యంతో లారీలు ప్రయాణించే రూట్లో అధికారుల తనిఖీలు నిర్వహించడం లేదన్న వాదన వినిపిస్తోంది. తనిఖీలు చేయాల్సిన రవాణా, మైనింగ్, విజిలెన్స్, ఆర్ అండ్ బి, పోలీసు అధికారులకు నెలవారీ మామూళ్లు అందుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

శిథిలమవుతున్న రోడ్లు

చిన్నపాటి రోడ్లపై బండరాళ్ల లారీలు రాకపోకలు సాగించడంవల్ల రహదారులు శిథిలమవుతున్నాయని, గోతులు పడి వేసిన కొద్దిరోజులకే పాడుతున్నాయంటూ ఆయా గ్రామాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బండరాళ్ల లారీలే కాకుండా ఇతర లోడుతో వెళ్లే కొన్ని భారీ వాహనాలు, మినీ వ్యాన్‌లు, కార్లు కూడా ఇదే రూట్‌లో రాకపోకలు సాగిస్తున్నాయని చెబుతున్నారు. ఈ లారీలు గ్రామాల మీదుగా వెళ్లడాన్ని నియంత్రించాలని ఆయా గ్రామాల వారు కోరుతున్నారు.

హెవీలోడ్‌తో వెళ్తున్న లారీల పట్టివేత



పోలీసులు పట్టుకున్న లారీ

నక్కపల్లి: టోల్ ఫీజును ఎగ్గొట్టేందుకు సామర్థ్యానికి మించి బరువుతో వెళుతున్న రెండు లారీలను నక్కపల్లి పోలీసులు శనివారం పట్టుకున్నారు. బండరాళ్లతో రాజమండ్రి నుంచి రాంబిల్లి వెళ్తున్న లారీలు క్రషర్ బూడిదతో తిరిగి రాజమండ్రి వెళుతున్నాయి. ఒక్కొక్క లారీలో సుమారు 80 టన్నుల బరువు గల క్రషర్ వేస్ట్ లోడ్ చేశారు. జాతీయ రహదారిపై వేంపాడు వద్ద ఉన్న టోల్‌ప్లాజా మీదుగా వెళ్తే పరిమితికి మించి లోడ్ చేసినందుకు రూ.5 వేలకుపైనే పెనాల్టీ చెల్లించాల్సి వస్తుంది. ఈ పెనాల్టీ నుంచి తప్పించుకునేందుకు ఉపమాక, బోయపాడు, తమ్మయ్యపేట, అమలాపురం మీదుగా వేంపాడు చేరుకుని అక్కడ నుంచి రాజమండ్రి వెళ్లేందుకు ఈ రెండు లారీలు శనివారం ఉదయం రాకపోకలు సాగిస్తుండగా ఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు ఈ రెండు లారీలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీటిని రవాణాశాఖ వారికి అప్పగించడం లేదా ఉన్నతాధికారుల సూచన మేరకు పెనాల్టీ విధించడం చేస్తామని సీఐ కుమారస్వామి తెలిపారు. కాగా ఈ లారీలను అడ్డదారుల్లో పంపించేందుకు నక్కపల్లి పరిసర ప్రాంతాల్లో విలేకరులుగా చెలామణి అవుతున్న ముగ్గురు వ్యక్తులతో పాటు ఉపమాక పరిసర గ్రామాలకు చెందిన కొంత మంది కూటమి నాయకులు ఒప్పందం కుదుర్చుకుని సహకరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

వైద్య సిబ్బంది సాహసం



వాలాబు గిరిజన పంచాయతీలో అర్ధరాత్రి సమయంలో వైద్య సేవలందిస్తున్న దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్య మేఘన, సిబ్బంది

- దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రయాణం
- గిరిజన గ్రామాల్లో అర్ధరాత్రి వైద్య సేవలు

దేవరాపల్లి: ప్రజల ఆరోగ్యం గురించి వాకబు చేసేందుకు దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ.పూజ్య మేఘన శుక్రవారం రాత్రి పెద్ద సాహసం చేశారు. గిరిజన జనాభాతోపాటు శివారు గ్రామాలున్న వాలాబు పంచాయతీలో 45 ఏళ్ల లోపు వయసు వారిలో ఎంత మందికి సికిల్ సెల్ వ్యాధి ఉందో సర్వే చేయాల్సి ఉంది. ఏ ఊరు వెళ్లినా గిరిజనులు ఉండకపోవడంతో ఈ సర్వేకు ఆటంకం కలుగుతోంది. ఈ విషయాన్ని గ్రహించిన వైద్యాధికారి పూజ్య మేఘన సర్వే పూర్తి చేయాలన్న సంకల్పంతో గిరిజనులు అందుబాటులో ఉండే రాత్రి పూట శుక్రవారం నాడు అటవీ ప్రాంతమైన వాలాబుకు పయనమయ్యారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లిన వైద్య సిబ్బంది అర్ధరాత్రి 12 గంటల వరకు అక్కడే ఉండి సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ వ్యాధి వలన కలిగే అనర్థాలను గిరిజనులకు వివరించారు. రాత్రి పూట తమ ఇళ్లకు వైద్యాధికారి సిబ్బందితో కలిసి రావడంతో అడవి బిడ్డలు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. డాక్టర్ పూజ్య మేఘనతోపాటు ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్ తదితరులు గ్రామానికి పాల్గొన్నారు. వారి అంకిత భావానికి సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి.

క్లుప్తంగా

యువతికి అసభ్యకర మెసేజ్‌లు

● దార్లపూడికి చెందిన యువకుడు అరెస్ట్

యలమంచిలి రూరల్ : సోషల్ మీడియాలో యువతికి అసభ్యకర చిత్రాలు, సందేశాలు పంపించిన యువకుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు యలమంచిలి సీఐ ఎస్. ధనుంజయరావు చెప్పారు. యలమంచిలి పట్టణం రాంనగర్‌కు చెందిన 19 ఏళ్ల యువతికి ఎస్.రాయవరం మండలం దార్లపూడికి చెందిన బొండా చండీశ్వర్రావు (25) గత రెండు నెలలుగా ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా మార్ఫింగ్ చేసిన ఫోటోలు, అసభ్యకర సందేశాలు పంపిస్తున్నాడు. దీనిపై యువతి 10 రోజుల క్రితం యలమంచిలి పట్టణ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు తీవ్రత దృష్ట్యా కేసు దర్యాప్తును సీఐ ధనుంజయరావు చేపట్టారు. నిందితుడు పంపిస్తున్న సందేశాలను పరిశీలించి సాంకేతిక ఆధారాలు సేకరించిన తర్వాత అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చగా రిమాండ్ విధించారు. సామాజిక మాధ్యమాలను సమాచారం త్వరితగతిన చేరవేయడానికి, ఇతర సౌలభ్యం కోసం ఉపయోగించుకోవాలే తప్ప దుర్వినియోగం చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఈ సందర్భంగా హెచ్చరించారు. ముఖ్యంగా మహిళలు, యువతులు, మైనర్లను వేధించేవారికి ఇబ్బందులు తప్పవన్నారు. యువకులంతా దీనిని దృష్టిలో ఉంచుకుని సామాజిక మాధ్యమాల్లో శృతి మించి ఇతరులను కించపరిచేలా పోస్టులు పెడితే కటకటాల వెనక్కి వెళ్లక తప్పదని ఆయన స్పష్టం చేశారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం



బయ్యవరంలో హజరత్ అన్సర్ మదీని ఔలియా దర్గాలో సమాధిని దర్శించుకొని ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



హాజరైన భక్తులు

కశింకోట: మండలంలోని బయ్యవరం వద్ద వెలసి ఉన్న హజరత్ అన్సర్ మదీన్ని ఔలియా దర్గా ఉరుసు షరీఫ్ (చందనోత్సవం) శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లాతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఒడిస్సా, టాటా నగర్ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ముస్లింలతో పాటు స్థానిక హిందూవులు బారులు తీరి దర్గాను దర్శించి ప్రార్థనలు చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు గుంపులుగా సంప్రదాయ వస్త్రధారణతో తరలి వచ్చి సంప్రదాయంగా చందనం పూసి చాదర్లు కప్పి గులాబీ పూలు జల్లి ప్రార్థనలు చేశారు. తీపి పదార్థాలు, ఖర్జూరం, పండ్లను ప్రసాదంగా నివేదించారు. ఉదయం గుసుల్ షరీఫ్ (చందనం పూయుట) నిర్వహించారు. సాయంత్రం పాతియాఖాని అనంతరం తబురుక్ (ప్రసాద వితరణ) చేశారు. దర్గా ముతవల్లి అబ్దుల్ మాకీం, కార్యదర్శి మహమ్మద్ అయాజ్, అనకాపల్లి జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు పి.ఎస్.ఎన్ హుస్సేన్, మదీన మసీద్ అధ్యక్షుడు ఎస్.ఎ. దావూద్ అలీ తదితరులు దర్గాను దర్శించారు. దర్గాను అందంగా విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఈ సందర్భంగా తీర్థ మహోత్సవం జరిగింది. అలంకరణ వస్తువులు, తిను బండారాలు, పూజా సామగ్రి అమ్మకాలు జోరుగా సాగాయి. ఆకాశ చక్రాలు, రంగుల రాట్నం, ఫోం జారుడు బల్లలపై పిల్లలతో పాటు పెద్దలు ఆనందంగా తిరుగాడారు. డీఎస్పీ శ్రావణి, సీఐ అల్లు స్వామి నాయుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

బల్క్ డ్రగ్‌పార్క్‌కు వ్యతిరేకంగా రాజయ్యపేటలో ర్యాలీ



రాజయ్యపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు, ఉపాధి కూలీలు శనివారం నిరసన వ్యక్తం చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యుడు అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో మత్స్యకారులు, కూలీలు బల్క్ డ్రగ్ పార్క్ వద్దు, ప్రాణాలే ముద్దు అంటూ పని ముట్లను పట్టుకుని నినాదాలు చేశారు. రాజయ్యపేట నుంచి హెటిరో కంపెనీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు, అప్పలరాజులతోపాటు, మత్స్యకార నాయకులు మాట్లాడుతూ తొండంగి, యు.కొత్తపల్లి, కాకినాడ ప్రాంతాల్లో ప్రజలు వ్యతిరేకించిన బల్క్ డ్రగ్‌పార్క్‌ను రాజయ్యపేట సమీపంలో ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. ఇప్పటికే పరవాడ, అచ్చుతాపురం, నక్కపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రమాదకర పరిశ్రమల వల్ల ప్రజలు క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు, చర్మ వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. బల్క్ డ్రగ్ పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రభావిత గ్రామాల్లో గ్రామసభలు, ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాటు చేయలేదన్నారు. ఆగ మేఘాల మీద భూములు కేటాయించి మౌలిక సదుపాయాల కల్పన పనులు ప్రారంభించేశారని విమర్శించారు. నిర్వాసితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం, పునరావాసం కల్పించకుండానే పనులు ప్రారంభించారని మండిపడ్డారు. నిరసనలో సీపీఎం మండల కన్వీనర్ రాజేష్, కార్యదర్శి మహేష్‌బాబు, విద్యాకమిటీ చైర్మన్ కాశీరావు, మాజీ ఎంపీటీసీ పిక్కి తాతీలు, జనసేన నాయకులు పిక్కిస్వామి, మత్స్యకార నాయకులు సోమేశ్వరరావు, అప్పలరాజు, నూకరాజు ఏడుకొండలు, భూలోక, వీరన్న పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాలలో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



ఆర్.ఎస్.ఎస్.నగేష్ 464/470



ఆర్.నాగ సూర్యభవ్య 429/440



ఎం.సత్య అక్షయ 986/1000

పాయకరావుపేట : శనివారం ప్రకటించిన ఇంటర్మీడియేట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ తెలిపారు. తమ కళాశాల నుండి 15 మందికి పైగా విద్యార్థులు 980 కంటే ఎక్కువ మార్కులు సాధించారని తెలిపారు.

మొదటి సంవత్సరం ఎంపీసీలో ఆర్.ఎస్.ఎస్.నగేష్ 464/470, జి.అనూష 460/470, కె.యామిని జ్యోతిక 460/470, జి.లాస్యశ్రీ 460/470 మార్కులు, బైపీసీలో ఆర్.నాగ సూర్యభవ్య 429/440 మార్కులు సాధించారు.

అలాగే ద్వితీయ ఎంపీసీలో ఎ.హర్షిత 988, ఎస్.మేఘన 986, బైపీసీలో ఎం.సత్య అక్షయ 986, సిహెచ్ పూర్ణ శివాని 984 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, ప్రిన్సిపాల్ భానుమూర్తి, అకడమిక్ ఇంచార్జి డి.శ్రీలక్ష్మి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

12 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు



నాటు సారాతో పట్టుబడిన వ్యక్తితో చోడవరం ఎక్సైజ్ పోలీసులు

దేవరాపల్లి : రైవాడ శివారు బేతపూడి పరిసర ప్రాంతాలల్లోని నాటుసారా స్థావరాలపై చోడవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వి.పాపునాయుడు శనివారం ఉదయం సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో అదే గ్రామానికి చెందిన ఉగ్గిన శివ నుంచి 12 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ స్పష్టం చేశారు. కేసు నమోదు చేసి, నిందితుడిని చోడవరం కోర్టులో హాజరు పరిచామన్నారు.

సెక్యూరిటీ గార్డ్ కుమార్తెకు అత్యధిక మార్కులు

● ఇంటర్ ఫలితాల్లో కైట్స్ విద్యార్థిని ప్రతిభ



సుప్రియను అభినందిస్తున్న కైట్స్ కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి

అచ్యుతాపురం రూరల్ : ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కైట్స్ కళాశాల విద్యార్థిని పాలెపు సుప్రియ (1000/988)మార్క్సుతో అనకాపల్లి జిల్లాకి ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యార్థిని తండ్రి ఒక అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా, తల్లి దినసరి కూలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఎన్ని అవరోధాలు ఎదుర్కొంటున్నా తన పిల్లలను ఉన్నత స్థాయిలో నిలిపేందుకు పడే తపన సుప్రియ తల్లిదండ్రుల్లో కనిపిస్తుంది. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవ్వాలనే పట్టుదలతో సుప్రియ బాగా చదివి ఇంటర్‌లో అనకాపల్లి జిల్లాకే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి మాట్లాడుతూ సుప్రియకి ఫ్రీ అడ్మిషన్‌తో పాటు ప్రతి ఏటా రూ.10వేల ప్రోత్సాహకంగా అందజేస్తున్నట్టు తెలిపారు. ఏదైనా సాధించాలనే దృఢ సంకల్పం ఉంటే ఎటువంటి వారైనా అనుకున్నది సాధించవచ్చునని చిరంజీవి అన్నారు. తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

వడగళ్ల వానతో అతలాకుతలం



ఎన్టీఆర్ గ్రౌండ్ వద్ద కుప్పకూలిన భారీ అమ్మవారి విద్యుత్ అలంకరణ సెట్



లక్ష్మీదేవిపేట పాత్రుడు కాలనీలో ఇంటి వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభం

- అనకాపల్లి, బుచ్చెయ్యపేటలో భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- తెగిన కరెంటు తీగలు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

అనకాపల్లి టౌన్/బుచ్చెయ్యపేట: జిల్లాలో పలుచోట్ల శనివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచి భానుడు తమ ప్రతాపం చూపించాడు. మధ్యాహ్నం రెండు గంటల వరకు 35.6 డిగ్రీల సెల్సియస్‌తో ఎండ మండిపోగా ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఈదురు గాలులతో వాతావరణం అంతా చల్లబడిపోయింది. అనకాపల్లిలో సుమారు గంటసేపు కురిసిన వర్షం 25.8 మి.మీ గా నమోదైంది. ప్రారంభంలో కొద్ది సేపు వడగళ్లు పడ్డాయి. ఈ వర్షం వలన లక్ష్మీదేవిపేట పాత్రుడు కాలనీలో భారీ వృక్షంతో పాటు రెండు విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. ఈ గాలికి విద్యుత్ వైర్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. జన సంచారం లేకపోవడంతో పెద్ద ప్రాణ నష్టమే తప్పింది. గవరపాలెం నూకాంబిక ఉత్సవాలలో భాగంగా ఎన్టీఆర్ గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసిన భారీ అమ్మవారి విద్యుత్ అలంకరణ సెట్ నేలకొరిగింది. ఈ ప్రాంతంలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. గవరపాలెం పూర్తిగా మునిగిపోయింది. విజయరామరాజు పేట అండర్ బ్రిడ్జిలో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బుచ్చెయ్యపేట మండలంలో వడ్డాది, బంగారుమెట్ట, ఎల్‌బీ పురం, విజయరామరాజుపేట తదితర గ్రామాల్లో వడగళ్లతో వర్షం కురిసింది. దీంతో జీడిమామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. వడగళ్లు మామిడి కాయలపై పడితే మచ్చలు వచ్చి కాయలు దెబ్బతిని కుళ్లిపోతాయని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విజయరామరాజు పేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిపోయిన నీరు



గవరపాలెం పార్కు సెంటర్‌లో నిలిచిపోయిన నీరు

బుచ్చెయ్యపేటలో తప్పిన పెను ప్రమాదం



బుచ్చెయ్యపేటలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేటలో కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో పెను ప్రమాదం తప్పింది. బుచ్చెయ్యపేటకు చెందిన పాతాళ చిరంజీవి తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం మంగళాపురం గ్రామంలో తమ బంధువుల వివాహానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో శనివారం ఉదయం మంగళాపురం నుంచి తిరిగి వస్తూండగా నేతవానిపాలెం దాటిన తరవాత బుచ్చెయ్యపేట దగ్గరలో ఎదురుగా నడిచి వస్తున్న వ్యక్తిని తప్పించబోయి పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొన్నాడు. విద్యుత్ స్తంభం విరిగి రోడ్డుపై పడిపోయింది. కారు నుజ్జు నుజ్జు అవగా అందులో ఉన్న నలుగురు వ్యక్తులతో పాటు ఇద్దరు చిన్న పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. కొత్తగా వేస్తున్న విద్యుత్ స్తంభం అవడం విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ స్తంభాన్ని ఆనుకుని గ్రామానికి సరఫరా అవుతున్న విద్యుత్ స్తంభం సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫారం ఉంది. దీనిని ఢీ కొడితే మంటలు చెలరేగి పెద్ద ప్రమాదం సంభవించేదని స్థానికులు తెలిపారు. రోడ్డుపై పడ్డ విద్యుత్ స్తంభాన్ని స్థానికులు పక్కకు తొలగించి వాహనాల రాకపోకలు సాగేలా చేశారు.

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు



ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం చేస్తున్న దత్త విజయానంద తీర్థస్వామీజీ

అనకాపల్లి: జన్మించిన ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే దేవుని జ్ఞానంలో ఉండాలని మైసూర్ పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి గణపతి దత్త క్షేత్రంలో స్వామిజీ శనివారం అంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు, మహిళా భక్తులచే అనఘావ్రతం నిర్వహించారు. మనస్సు ప్రశాంతత కోసం దేవుని స్మరణలో ఉండాలని తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్కను నాటి, చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చింతామణి గణపతి దత్తక్షేత్రం ప్రతినిధి అంజనేయరాజు, సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రమతోనే లక్ష్యసాధన



పాఠశాలలో కళావేదికను ప్రారంభిస్తున్న గంగుపాం త్రినాథమూర్తి

తుమ్మపాల: విద్యార్థి దశలోనే లక్ష్యసాధన దిశగా శ్రమించాలని విశ్రాంత నేవీ అధికారి గంగుపాం త్రినాథమూర్తి అన్నారు. మండలంలో సీతానగరం జిల్లా పరిషత్ పాఠశాలలో కళావేదికను శనివారం ఆయనతో పాటు స్కూల్ కమిటీ చైర్మన్ దుర్గానాగలక్ష్మి, మాజి సర్పంచ్ భీశెట్టి అప్పారావు ప్రారంభించారు. చదువుకున్న పాఠశాలకు తన వంతు సాయంగా కళావేదిక నిర్మాంచానని, పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ టి.ప్రసాదరావు, పి.నర్సింగరావు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ నెల 14 ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. నరసింగబిల్లి, తాళ్లపాలెం, ఏనుగుతుని, జెట్టపురెడ్డితుని, చింతలపాలెం, నూతన గుంటపాలెం, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్ పేట, జి. భీమవరం, అచ్చెర్ల తదితర గ్రామాల్లో నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 1,734 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,600	4,380
రెండో రకం	3,170	3,830
మూడో రకం	2,950	3,130

అనకాపల్లి సినిమాలు

రాజా	: మాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్-1	: గుడ్ బ్యాడ్ అగ్లీ
సత్యనారాయణ స్క్రీన్-2	: రాజుగారి దొంగలు
పర్తిసాయి	: కోర్టు
షిర్డీసాయి	: అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర	: చెరసాల
శ్రీసత్య	: సంక్రాంతికి వస్తున్నాం
రామచంద్ర	: జాక్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-06 యూనిట్లు , బీ పాజిటివ్-09 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు ఏబీ పాజిటివ్-02 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు. లోకేష్‌ను 9703619706 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 363 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 296 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

చదువుల తల్లులు

- ఇంటర్‌లో సత్తా చాటిన బాలికలు
- అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత



బైపీసీలో ప్రథమ స్థానంలో నిలిచి 983 మార్కులు సాధించిన కంట్రెడ్డి రాజులమ్మ

కశింకోట: మండలంలోని మూడు ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో మెరిశారు. అత్యుత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారు. తేగాడలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బైపీసీలో కంట్రెడ్డి రాజులమ్మ 983 మార్కులు సాధించి రాష్ట్రంలోని కస్తూర్బా విద్యాలయాల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. గత ఏడాది నక్కపల్లి కస్తూర్బా విద్యాలయం ప్రథమ స్థానంలో నిలవగా, ఈ ఏడాది తేగాడ కేజీబీవీ ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. ఆరుగురు బాలికలు 950 కంటే ఎక్కువ మార్కులు సాధించడం విశేషం. ఈ విద్యాలయం నుంచి ఈ ఏడాది ద్వితీయ సంవత్సరంలో 29 మంది పరీక్షలకు హాజరు కాగా, 27 మంది ఉత్తీర్ణులయ్యారు. 92 శాతం మేర ఉత్తీర్ణత సాధించారు. ఇది గత ఏడాది 76 శాతంగా ఉంది. అంటే 16 శాతం ఎక్కువ ఉత్తీర్ణత సాధించారు. రాజులమ్మ తర్వాత ఎం. రూప 979 మార్కులు, లక్ష్మీదేవి 973, కె. పావని 956, వి. హేమ 955, కె. రమాదేవి 954 వంతున అత్యధిక మార్కులు సాధించారు. అయితే ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 30 మందికి 29 మంది ఉత్తీర్ణులయ్యారు. 96 శాతంగా ఉత్తీర్ణత ఉంది. ఇదే గత ఏడాది శత శాతం ఉంది. ప్రథమ సంవత్సరంలో జి. రమ్య 440 మార్కులకు 434 మార్కులు, డి. అంజలి 427, ఎన్. ఝాన్సీ, కె. భవానీ 426, కె. జయశ్రీ 424, ఆర్. భాగ్యశ్రీ 416 మార్కులు సాధించారు. ఈ ఫలితాలపై ప్రిన్సిపాల్ చంద్రకళ మాట్లాడుతూ తాను, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రణాళికాబద్ధంగా చదివించడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధించగలిగామని 'సాక్షి'కి తెలిపారు.



తేగాడ కస్తూర్బా గాంధీ విద్యాలయం

మోడల్ స్కూల్లోనూ బాలికలదే అగ్రాసనం..

తేగాడ వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో ఇంటర్‌లో నాలుగు గ్రూపుల్లోను బాలికలే అగ్రాసనంలో నిలిచారు. ఎంపీసీలో వెయ్యికి 970 కొప్పిశెట్టి హనిష్కారత్నం, బైపీసీలో యల్లపు రేష్మా వెయ్యికి 970 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఎంఈసీలో వి. పూజిత 948, సీఈసీలో ఎస్. స్రవంతి 852 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో 76 మంది పరీక్షలు రాయగా 73 మంది ఉత్తీర్ణులై 96 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక మొదటి సంవత్సరంలో 61 మందికి 52 మంది ఉత్తీర్ణులై 85.2 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఎస్. రోహిత్ దుర్గ 447/470, బైపీసీలో కె. అనూష 431/440, ఎంఈసీలో ఎ. సునీత 412/500, సీఈసీలో ఆర్ మేఘన 455/500 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ ఐ. మార్తా తిలకం తెలిపారు.

గురుకుల కళాశాలలో..

తాళ్లపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 96 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 53 మంది పరీక్షలు రాయగా, 51 మంది ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది 95 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత ఒక శాతం పెరిగింది.

ఇంజినీర్ కావడమే లక్ష్యం..



తేగాడ ఏపీ మోడల్ స్కూల్లో చదివాను. ఇంటర్ ఎంపీసీలో వెయ్యికి 970 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాను. మాది ఎస్. రాయవరం మండలం అడ్డురోడ్డు వద్ద పెద్ద గుమ్మలూరు గ్రామం. మాది మధ్య తరగతి కుటుంబం. తల్లి కావేరి ప్రైవేటు స్కూలు టీచర్. తండ్రి ఫణికుమార్ ఎలక్ట్రీషియన్. నేను ఇంజినీర్ కావాలనుకుంటున్నాను.

– కొప్పిశెట్టి హనిష్కా రత్నం

డాక్టర్ కావాలనుకుంటున్నాను..



నేను డాక్టర్ కావాలనుకుంటున్నాను. తేగాడ ఏపీ మోడల్ స్కూల్లో చదివాను. ఇంటర్ బైపీసీలో 970 మార్కులు వచ్చాయి. మాది యలమంచిలి మండలం జంపపాలెం గ్రామం. సాధారణ వ్యవసాయ కుటుంబం. తండ్రి యల్లపు నూకరాజు, తల్లి మహాలక్ష్మి.

– యల్లపు రేష్మ

ఎంపీసీలో వెయ్యి మార్కులకు వాసుపారి జ్యోయాసి 967, బైపీసీలో దుమంతి షారోన్, రాజాన నందిని 960 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే ప్రథమ సంవత్సరంలో 72 మందికి 62 మంది ఉత్తీర్ణులై 86 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో వేంపల్లి మహేశ్వరి 439/470 మార్కులు, బైపీసీలో తాడి హేమలత 425/440 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ జి. గ్రేస్ తెలిపారు.

ఇంటర్‌లో మెరిసిన అనకాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు..

అనకాపల్లి టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 82 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 37 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయలో 45 మంది పరీక్షలు రాయగా 31 మంది ఉత్తీర్ణత సాధించారు. నారాయణ కళాశాలలో ఎంపీసీ విభాగంలో యశస్విని, బి రిష్మిత, కావ్యశ్రీ, సీపీ భాస్కర్ 464 మార్కులు సాధించగా బైపీసీ ప్రథమలో ఎం.కావ్యశ్రీ 428, లక్ష్మి 425, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ముత్యాల హిందుశ్రీ 987, పి. దేవి 986, బైపీసీలో పి. అనూష 972, జె. రేణుక 959 మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ కోనా విశ్వేశ్వరావు తెలిపారు. చైతన్య కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ సుబ్బారావు తెలిపారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థి బొండా భువన కృతి 466, డి. ఇషిక, కె. పూజా చాతుర్య, వై. తేజ, అనిరుథ్‌లు 465 మార్కులు, వి. భావన, కె. యశస్విని, ఎల్. శివకుమార్, వి. చరన్ సిద్ధార్థ, కె ప్రసన్నలక్ష్మి, పి. చరణ్య, వై. నందిని 460 మార్కులు సాధించారు. హిమశేఖర్ కళాశాల విద్యార్థులు ద్వితీయలో యు. దేవి 987, కె. హేమలలిత 972, సీఈసీ విభాగంలో వి. నందిని 968, ప్రథమ బైపీసీలో పి. జ్యోత్స్న 433 సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. ఎంపీసీలో వి. రవితేజ 462, జి. ధరహాసిని 461, ఎంఈసీలో కె. త్రివిక్రమ్ 465 మార్కులు సాధించారని కళాశాల చైర్మన్ కె. సౌరభ్ తెలిపారు.



బైపీసీలో 433 మార్కులు సాధించిన జ్యోత్స్న



ద్వితీయ ఇంటర్‌లో 889 మార్కులు సాధించిన పూర్ణానంద్

దంచికొట్టిన వడగళ్ల వాన



తుమ్మపాలలో భారీ వర్షం పడుతున్న దృశ్యం



అనకాపల్లి -చోడవరం రోడ్డులో వర్షంలోనే ప్రయాణిస్తున్న వాహనం

తుమ్మపాల: ఈదురు గాలులు, వడగళ్లతో మండలంలో శనివారం మధ్యాహ్నం భారీగా వర్షం కురిసింది. ఒక్కసారిగా ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ స్తంభాలు, అక్కడక్కడ చెట్లు నేలకొరిగాయి. రోడ్లపై వాహనచోదకులు ఎక్కడికక్కడ నిలిచిపోయారు. మధ్యాహ్నం 2 నుంచి దాదాపు 3 గంటల వరకు వడగళ్లతో ఏకధాటిగా కుండపోత వర్షం కురవడంతో గ్రామాల్లోని రోడ్లు జలమయమై, వడగళ్లు దర్శనమిచ్చాయి. గడిచిన పది రోజుల్లో మండలంలో మూడు సార్లు వాన కురవడంతో పంటపొలాలు తడిసి నీటితో నిండుకున్నాయి. వేసవిలోను వాగుల్లో నీరు పారి వర్షాకాలాన్ని తలపించాయి. వేసవి తాపానికి ఎండిపోతున్న పలు రకాల చెట్లు, పంటలకు సరిపడా నీరు లభించింది. ఉదయం నుంచి భగభగలాడించిన ఎండ మధ్యాహ్నానికి చల్లబడడంతో అంతా సేదదీరారు. గాలులకు విద్యుత్ తీగలు తెగిపడటంతో రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

న్యాయమూర్తికి ఘనంగా వీడ్కోలు

అనకాపల్లి టౌన్: పదో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్యకు బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. కర్నూలు ఏసీబీ కోర్టు న్యాయమూర్తిగా ఆమె బదిలీపై వెళుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారుల కేసుల పరిష్కారానికి న్యాయవాదుల నుంచి మంచి సహకారం లభించిందని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ధర్మారావు, రామకృష్ణ, రమేష్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కుమార్, కార్యదర్శి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ ఉపసంహరించుకోవాలి

అనకాపల్లి: దేశ సమైక్యతకు, మత స్వేచ్ఛకు తూట్లు పొడుస్తూ అర్ధరాత్రి తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేసి, జీవోను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణ ప్రతిపక్షాలు సూచించిన మేరకు కాకుండా ప్రభుత్వం ఏకపక్షంగా ఆమోదింపజేసుకున్నారని విమర్శించారు. దేశంలో మైనారిటీలు ముఖ్యంగా ముస్లింలను లక్ష్యంగా చేసుకున్న బీజేపీ దేశాన్ని మతం పేరిట విభజించేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు, కార్యవర్గ సభ్యులు డి.హెచ్.క్రాంతి, గురుబాబు, హరీష్, సంతోష్, నరాలశెట్టి సత్యనారాయణ, విత్తనాల పోతురాజు, బండి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రవికుమార్

అనకాపల్లి: మండలంలో పిసినికాడ శివాలయం వద్ద ఈనెల 10న ఇద్దరు వ్యక్తులు వికృత చేష్టలతో భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్న వీడియో వైరల్ కావడంపై ఈనెల 11న కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్, ఎస్ఐ రవికుమార్ తెలిపారు. నిజానికి అది 2018 ఏప్రిల్ 16 నాటిదన్నారు. అప్పుడు ఇద్దరు చిన్నారులను విశాఖలోని 2వ అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరు పరచగా, కోర్టు ఆదేశాల మేరకు జువైనల్ హోమ్‌కు తరలించామని చెప్పారు. న్యాయమూర్తి 2018 నవంబర్ 22న ఇద్దరికి శిక్ష విధించినట్లు తెలిపారు. ఇటీవల వైరల్ అవుతున్న వీడియో గత సంఘటనకు సంబంధించిందని, వాస్తవాలు తెలుసుకోకుండా, ఈ వీడియోను ప్రస్తుత ఘటనగా చెబుతూ సామాజిక మాధ్యమాలలో షేర్ చేయడం, కామెంట్లు చేయడం వల్ల ప్రజల్లో అపోహలు కలుగుతున్నాయని అన్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోకుండా ఎటువంటి వీడియోలు షేర్ చేయొద్దని, చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన శిశు విహార్ తరగతులు

అనకాపల్లి టౌన్: స్థానిక గాంధీనగరంలో భారతీయ విద్యా కేంద్రం విజ్ఞాన భారతి పాఠశాలలో శిశు విహార్ తరగతుల ముగింపు సమావేశం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నర్సరీ, ప్రి నర్సరీ చిన్నారుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్య అతిథిగా హాజరైన అకడమిక్ కోఆర్డినేటర్ డి. రాజశేఖర్ చిన్నారులకు ప్రశంశా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ అధ్యక్షురాలు ఎంవీఎస్ శిరీష, పాఠశాల ప్రినిపాల్ జి. సంకీర్తన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీచక్రస్నానం



మునగపాకలో శ్రీచక్రస్నానం నిర్వహిస్తున్న వేదపండితులు

మునగపాక: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ చక్రస్నానఘట్టం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు రేజేటి రామణాచార్యులు, రేజేటి సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం జరిగే పుష్పయాగంతో శ్రీరామ నవమి వేడుకలు ముగియనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు ఆడారి లక్ష్మణరావు తెలిపారు. శ్రీ చక్ర స్నాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, కోనపల్లి రామ్మోహనరావు, జల్లేపల్లి కిష్టప్ప, మొల్లేటి సత్యనారాయణ, విల్లూరి నరసింగరావు, బొడ్డేడ రామునాయుడు, త్రినాథ్, కాండ్రేగుల జగన్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు తక్షణమే అమలు చేయాలి

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నాయకులు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నప్పటికీ ఒక్క పథకం అమలు చేయలేదని వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి గైపూర్ రాజు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేరోజులు దగ్గరపడ్డాయని పేర్కొన్నారు. పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు.

ఆకట్టుకున్న స్టాంపులు, నాణాల ప్రదర్శన



పురాతన నాణాలు, స్టాంప్‌ల ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో పురాతన నాణాలు, స్టాంప్‌లను శనివారం ప్రదర్శించారు. వీటి సేకరణకర్త ఎం.రాజాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పురాతన కాలం నాటి నాణాలు, కరెన్సీ నోట్లు, స్టాంప్‌లను ప్రదర్శించారు. విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

కశింకోట: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు, కిషోర్ బాలికలతో సమావేశం నిర్వహించి పౌష్టికాహార అవశ్యకతను అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అమ్మాజీ, ధనలక్ష్మి, బొబ్రమ్మ, ఉమామహేశ్వరి, సత్యవతి, రామలక్ష్మి, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు వారాంతపు సెలవులివ్వాలి

అనకాపల్లి: ఏపీ పోలీస్ శాఖలో వారంతపు సెలవులు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకోవాలని విశ్రాంత జైల్ హెడ్ వార్డర్ బల్లా నాగభూషణం ఒక ప్రకటనలో కోరారు. నిత్యం పని ఒత్తిడితో పోలీస్ సిబ్బంది వ్యాధుల బారిన పడుతున్నారని, దీనిపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సాధించాలన్నారు. కుటుంబ సమేతంగా ఎక్కడికైనా వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న శ్రీనివాసరావు

మునగపాక: కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం అనకాపల్లికి చెందిన విల్లూరి రామారావు, సింహలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు శ్రీనివాసరావు రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల జగ్గారావు, సూరిశెట్టి రాము, పెంటకోట ఉమేష్, వెలగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉన్నత శిఖరాలే లక్ష్యం కావాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ మణికుమారి

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని శక్తి టీమ్ రూరల్ ఏఎస్ఐ ఎస్.మణికుమారి అన్నారు. స్థానిక గవరపాలెం బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలు, శక్తి టీమ్ అవశ్యకతపై శనివారం వివరించారు. విద్యార్థినుల సెల్‌ఫోన్లలో శక్తి టీమ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె తెలిపారు. మహిళలకు అత్యవసర సమయాల్లో ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, ఫోక్సో కేసులు, సెల్ఫ్ డిఫెన్స్ వంటి వాటిపై ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డ్రై సోయింగ్ విత్తనాలతో భూములు సారవంతం

తుమ్మపాల: రుతుపవనాలకు ముందు పంట భూముల్లో పీఎండీఎస్ డ్రై సోయింగ్ విత్తనాలు చల్లుకోవడం ద్వారా సారవంతమైన భూములు తయారవుతాయని ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ ప్రతినిధులు వర్మ, అప్పలరాజు అన్నారు. మండలంలో వెంకుపాలెం గ్రామంలో 30 రకాల విత్తనాల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కో రైతు 25 కేజీల చొప్పున ఒక్కో ఎకరానికి విత్తనాలు వేసుకోవడం వల్ల నేల సారవంతం అవ్వడమే కాకుండా నీటి నిల్వ సామర్థ్యం, చీడపీడల నివారణ సామర్థ్యం, రసాయన ఎరువుల ఖర్చు తగ్గి దిగుబడులు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్, వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఉమాశంకర్

కశింకోట: స్థానిక ఆర్ఈసీఎస్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణకు హాజరవుతున్న 130 మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను శనివారం ప్రిన్సిపాల్ బి. ఉమాశంకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఎలా సన్నద్ధం అవ్వాలనే విషయమై అవగాహన కలిగించారు. అసోసియేట్ ప్రిన్సిపాల్ కర్రి శివ, విభాగాధిపతులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణానికి చేరిన శ్రీరామ రక్ష రథం



తులసీనగర్ రామాలయం వద్దకు చేరుకున్న శ్రీరామరక్ష రథం

యలమంచిలి రూరల్: శ్రీరామ రక్ష రథయాత్ర శనివారం పట్టణంలోని తులసీనగర్ రామాలయం వద్దకు చేరుకుంది. మహిళలు, రామ భక్తులు కొబ్బరికాయలు, కదళీఫలాలు పెట్టి రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జైశ్రీరామ్ నినాదాలు మార్మోగాయి. అనంతరం రథం మునగపాక మండలం ఉమ్మలాడకు తరలివెళ్లింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, మళ్ల కొండబాబు, యల్లపు నాగరాజు, కర్రి జానకిరాం, ఆడారి రమణబాబు, పప్పు ఈశ్వర్రావు, నక్కా శంకర్, సియ్యాద్రి శ్రీను, ఆడారి భాస్కర్రావు, వేగి నాయుడు, పలు కోలాట బృందాలు, భజన బృందాలు పాల్గొన్నాయి.

విద్యార్థులకు ఉచిత శిక్షణ అభినందనీయం

ఎస్.రాయవరం: గ్రామీణ ప్రాంతంలో పాలిటెక్నిక్‌కు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉచిత కోచింగ్ ఇవ్వడం అభినందనీయమని రాజ్‌కమల్ వ్యవస్థాపకుడు ఎర్రమిల్లి జయరాం అన్నారు. పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో కోచింగ్ తీసుకుంటున్న 110 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఇటీవల 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కేంద్రంలో యలమంచిలి, కోటవురట్ల, నక్కపల్లి, ఎస్.రాయవరానికి చెందిన విద్యార్థులు శిక్షణ పొందుతున్నట్టు చెప్పారు.